## క్లుప్తంగా

### 'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్



శిబిరాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): గ్రామాల్లో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ అన్నారు. శుక్రవారం 19వ వార్డులో శిబిరాన్ని పరిశీలించి, సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. ఈ వైద్య శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలతో పాటుగా మందులు, కంటి అద్దాలు అందిస్తున్నట్లు తెలిపారు. అవసరమైతే కంటి ఆపరేషన్‌లు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, వార్డు కౌన్సిలర్ గ్యాదరి రవీందర్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### రంజాన్‌కు అన్ని ఏర్పాట్లు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రంజాన్ పండగ సందర్భంగా ముస్లింలు నమాజ్ నిర్వహించుకునే మసీద్, ఈద్గాల వద్ద మున్సిపల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ఈద్గా వద్ద ఏర్పాట్లను శుక్రవారం వారు పరిశీలించారు. వేసవి దృష్ట్యా ఈద్గాల వద్దకు వచ్చే వారికి షామియానాలు, తాగునీరు, విద్యుత్ దీపాలు తదితర ఏర్పాట్లు చేశామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ పరిసరాల్లో దుకాణాల నిర్వాహకులు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని ఎంపీఓ మంజుల అన్నారు. శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో కలసి ఆలయ పరిసరాల్లో వ్యాపార సముదాయాలను తనిఖీ చేశారు. ప్లాస్టిక్ కవర్లను ఉపయోగిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ప్రతీ రోజు హోటళ్లు, కిరణాదుకాణాల్లో తనిఖీలు నిర్వహించాలని, ఆలయ పరిసరాల్లో చెత్త పడవేసే వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి లోకేష్‌కు సూచించారు. టిఫిన్ సెంటర్లు, సత్రాలు, జ్యూస్ సెంటర్ నిర్వాహకులు ప్లాస్టిక్ వినియోగానికి బదులు ఆకులతో తయారు చేసిన విస్తరాకులు, స్టీల్ గ్లాసులు, స్టీల్ పేట్లు వాడాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కరుణాకర్, కిరణ్, మురళి, సతీష్, శ్రీశైలం, పంచాక్షరీ, వీణా తదితరులు పాల్గొన్నారు.

### పనుల్లో నాణ్యత పాటించాలి



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ గణేష్‌రెడ్డి

దుబ్బాక: సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని దుబ్బాక మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శుక్రవారం మున్సిపల్ పరిధి చెల్లాపూర్ 3వ వార్డులో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కౌన్సిలర్ మట్ట మల్లారెడ్డితో కలిసి పరిశీలించారు.

### సమస్యలు పరిష్కరించని సమావేశాలు ఎందుకు?

మండల సభలో సభ్యుల ఆగ్రహం

ములుగు(గజ్వేల్): సమస్యలు పరిష్కరించని సమావేశాలు ఎందుకని సభ్యులు మండిపడ్డారు. ఎంపీపీ లావణ్య అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన ములుగు మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల తీరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచ్‌లు భూపాల్ రెడ్డి, గణేష్, బాలకృష్ణ, కొండల్‌రెడ్డి, పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ప్రతీ సమావేశంలో అధికారులను కోరినా..పట్టించుకోవడంలేదని అన్నారు. వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్, మండల పీఏసీఎస్ చైర్మన్ అంజిరెడ్డి విద్యుత్ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సలీం, రైతు సమన్వయసమితి అధ్యక్షుడు నర్సింహ్మారెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వర్ రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

### పరామర్శ

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట భూంపల్లి మండలం చిట్టాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ కుమ్మరి కుంటయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని శుక్రవారం డీసీసీబీ డైరెక్టర్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు బక్కి వెంకటయ్య పరామర్శించారు. సర్పంచ్ పోతనక రాజయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవి, పీఏసీఎస్ చైర్మన్ శేర్ల కైలాష్, భాస్కర్, స్వామి పాల్గొన్నారు.

# వజ్రోత్సవాలకు బడి ముస్తాబు

- 'అపూర్వ' కలయికకు ఏర్పాట్లు
- పాఠశాల ఆవరణలో పైలాన్
- మే 1వ తేదీ వరకు వేడుకలు



హుస్నాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఇన్‌సెట్‌లో పైలాన్)

హుస్నాబాద్: హుస్నాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వజ్రోత్సవాలకు ముస్తాబైంది. 75ఏళ్ల చరిత్ర కలిగిన ఈ పాఠశాల వేడుకలు భావితరాలకు గుర్తుండిపోయేలా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పూర్వ విద్యార్థి కరీంనగర్ జిల్లా అదనపు కలెక్టర్ గాజుల శ్యాంప్రసాద్ లాల్ తండ్రి రజనీశ్రీ జ్ఞాపకార్థం సొంత ఖర్చులతో పాఠశాల ఆవరణలో పైలాన్‌ను ఏర్పాటు చేశారు. దీనిని ఈ నెల 23న విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించేందుకు సిద్ధమయ్యారు.

#### 1945లో ఏర్పాటు

- హుస్నాబాద్ ప్రభుత్వ పాఠశాలను అప్పటి సర్పంచ్, మాజీ శాసనసభ్యుడు బొప్పరాజు లక్ష్మీకాంతారావు 1945లో స్థాపించారు.
- ప్రాథమికోన్నత పాఠశాలగా ప్రారంభమై, అంచెలంచెలుగా ఎదిగి 1956లో ఉన్నత పాఠశాలగా రూపుదిద్దుకుంది.
- వేలాది మంది ఉత్తమ విద్యార్థులను తయారు చేసి అత్యుత్తమ పౌరులను సమాజానికి అందించింది.
- 2020 నాటికి 75ఏళ్లు పూర్తయ్యాయి. కరోనా కారణంగా వజ్రోత్సవాలు నిర్వహించలేదు.
- ఈ ఏడాది వజ్రోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.
- ఈ నెల 23 నుంచి మే 1 వరకు నిర్వహించే వేడుకలకు పెద్ద బడి వేదిక కాబోతోంది.
- ఇప్పటికే పాఠశాలకు రంగులు వేసి అందంగా అలంకరించారు.
- ఈ పాఠశాలలో అత్యధిక కాలం ఉపాధ్యాయుడిగా పనిచేసిన డీవీఆర్ నర్సయ్య సార్ పేరును వేదికకు నామకరణం చేశారు.
- మొదటి హెచ్‌ఎంగా పి.మనోహరస్వామి పని చేయగా, ఈ పాఠశాలలో ఇప్పటివరకు 11వేల మంది విద్యార్థులు పదో తరగతి పూర్తి చేశారు.

#### అంతా ఇక్కడ చదివినవారే..

కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ లింగమూర్తి, ఆదాయపన్ను శాఖ డిప్యూటీ కమిషనర్ తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, కరీంనగర్ అదనపు కలెక్టర్ గాజుల శ్యాంలాల్ ప్రసాద్ లాల్, అంబేడ్కర్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ బోజు శ్రీనివాస్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అయిలేని శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఇక్కడే విద్యనభ్యసించారు. తెలంగాణ తొలి శాసన సభ స్పీకర్ సిరికొండ మధుసూధన చారి ఈ బడి పూర్వ విద్యార్థే కావడం విశేషం.

#### అదృష్టంగా భావిస్తున్నా



పెద్ద బడిలో చదివి, ఇదే పాఠశాలలో విద్యాబోధన చేయడం అదృష్టంగా భావిస్తున్నా. ప్రధానోపాధ్యాయురాలిగా ఉన్న సమయంలో వజ్రోత్సవాలు నిర్వహించుకోవడంత జీవితంలో మరిచిపోలేని ఘట్టం. వేడుకలు అంతా తరలి రావాలి.

– బందారి మనీల, హెచ్‌ఎం

#### ఆ రోజులు ఇంకా గుర్తున్నాయి



నాడు పెద్ద బడిలో నేర్చుకున్న పాఠాలు నేడు ఈ స్థాయికి తీసుకు వచ్చాయి. ఎంతో మంది మేధావులను తయారు చేసిన బడి వజ్రోత్సవాలు జరుపుకోవడం సంతోషంగా ఉంది. పెంకుల బడిలో చదివిన రోజులు ఇంకా గుర్తున్నాయి.

– అయిలేని శ్రీనివాస్ రెడ్డి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, శంషాబాద్

#### జీవితాన్ని మార్చింది



బడిలో గురువులు బోధించిన పాఠాలు, సంస్కారం మంచి జీవితాన్ని ప్రసాదించాయి. పాఠశాలలో కాంపిటీషన్ పరీక్షలు, ఉపన్యాసం, వ్యాసరచన పోటీల ద్వారా ఉన్నత విద్య అభ్యసించి జీవితంలో స్థిరపడ్డా.

– తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ఇన్‌కంటాక్స్, హైదరాబాద్

## మతసామరస్యానికి ప్రతీక రంజాన్

ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



ఇఫ్తార్ విందులో ముస్లింలతో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

చేర్యాల(సిద్దిపేట): మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అన్నారు. శుక్రవారం షాదీఖానాలో భవన్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో హాజరై ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు. అనంతరం రంజాన్ మాస శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గ ప్రజలందరూ అల్లా దయతో ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పెడతల యెల్లారెడ్డి, నాయకులు ముస్త్యాల బాల్‌నర్సయ్య, అంజయ్య, బిక్షపతి, గిరిదర్, సిద్దిరాములు, తిరుపతి పాల్గొన్నారు.

## ఇంటి పన్ను తగ్గించే వరకు పోరాటం



నినాదాలు చేస్తున్న జేఏసీ, అఖిలపక్ష నాయకులు

చేర్యాల(సిద్దిపేట): ఇంటి పన్నుల భారం తగ్గించేవారకు పోరాడుతామని జేఏసీ చైర్మన్ రామగళ్ల పరమేశ్వర్ డిమాండ్ చేశారు. శుక్రవారం జేఏసీ, అఖిలపక్షం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద వంటావార్పు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చేర్యాల పట్టణంలో సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని ఆరోపించారు. పెంచిన ఇంటి పన్నులు తగ్గించాలని ధర్నాలు, బంద్‌లు, రాస్తారోకోలు చేసినా పాలకవర్గాలు పట్టించుకోవడంలేదని అన్నారు. కార్యక్రమంలో జేఏసీ, అఖిలపక్ష నాయకులు ఆగంరెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్, అశోక్, బీరయ్య, నర్సింగరావు, కళావతి, యాదయ్య, సత్యనారాయణ, సిద్దయ్య, వెంకన్న, నారాయణరెడ్డి, నర్సింహారెడ్డి, యాదయ్య, చిరంజీవులు, భిక్షపతి, శశిధర్, వసంతి, భూమయ్య, వెంకట్‌మావో, యాదవరెడ్డి, నాగరాజు, ప్రసాద్, సుదర్శన్, రంజిత్‌రెడ్డి, సిద్ధులు, శ్రీనివాస్, పట్టణ ప్రజలు, వ్యాపారులు, పన్ను బాధితులు తదితరులు పాల్గొన్నారు.

### గ్రామాన్ని ఆదర్శంగా నిలపాలి

డీపీఓ దేవకీదేవి



వ్యర్థాల నిర్వహణను పరిశీలిస్తున్న అధికారులు

సిద్దిపేటరూరల్: గ్రామంలో స్వచ్ఛత కార్యక్రమాలు అమలు చేసి ఆదర్శంగా నిలపాలని డీపీఓ దేవకీదేవి అన్నారు. శుక్రవారం నారాయణరావుపేట మండలం జక్కాపూర్‌లో పర్యటించి డంపింగ్ యార్డు, జంతువ్యర్థాల నిర్వహణ విధానాన్ని పరిశీలించారు. తడి, పొడి చెత్త సేకరణ, జంతువ్యర్థాల నిర్వహణపై సర్పంచ్ పర్శరాములు, సెక్రెటరీని అడిగి తెలుసుకున్నారు. స్వచ్ఛత కార్యక్రమాల్లో పురోగతి పెంచేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పాలకవర్గం, సిబ్బంది పాల్గొన్నారు.

### ఘనంగా సంస్కృతి దీక్ష యజ్ఞం

చిన్నకోడూరు(సిద్దిపేట): సృష్టికి మూలం హిందూ ధర్మమని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి రాజేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మేడిపల్లిలో సంస్కృతి దీక్ష యజ్ఞం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మాన్ని పాటించిన రాముడి అడుగు జాడల్లో నడవాలని, సమాజంలో అందరం ఒక్కటే అనే భావనతో కలిసిమెలిసి ఉండాలన్నారు. అనంతరం 23 కుటుంబాలను శ్రీరాముడి ఫొటో, భగవద్గీత, నూతన వస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రాంత ధర్మ ప్రసార సమితి సభ్యురాలు ఉమారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, వీహెచ్‌పీ విభాగ్ కార్యదర్శి గ్యాదరి రాజారామ్, జిల్లా ప్రతినిధులు నరేష్, మురళి, నాగేందర్, శ్రీకాంత్, శ్రీనివాస్, అనిల్, నాగరాజు, దినేష్, సందీప్, నరేందర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

### పెండింగ్ డబ్బులు చెల్లించాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): 2021–22 విద్యా సంవత్సరం పదో తరగతి సప్లమెంటరీ మూల్యాంకన డబ్బులను ప్రభుత్వం త్వరగా అందించాలని పీఆర్టీయూ నాయకులు కోరారు. శుక్రవారం జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆదరాసుపల్లి శశిధర్ శర్మ, గౌరవాధ్యక్షుడు మల్లుగారి ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి పంతం వెంకటరాజం మాట్లాడుతూ.. ఏడాది క్రితం మూల్యాంకనం పూర్తయినా.. ఇప్పటి వరకు డబ్బులు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు విజయ, సుజాత, సురేందర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, తొగుట, చేర్యాల మండల అధ్యక్షుడు రామచంద్రా రెడ్డి, చేర్యాల మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్ రెడ్డి, కేవీయన్ రెడ్డి, మిరుదొడ్డి మండల అధ్యక్షుడు సిద్ధి వెంకటేష్, శుభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### హాస్టల్ ఏర్పాటు చేయండి

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల పట్టణ కేంద్రంలో పోస్ట్ మెట్రిక్ హాస్టల్ ఏర్పాటు చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ డివిజన్ కమిటీ అధ్యక్షుడు ఆముదాల రంజిత్‌రెడ్డి డిమాండ్ చేశాడు. శుక్రవారం ఫెడరేషన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం తహసీల్దార్ ఆరీఫాకు వినతి పత్రం అందించారు. పట్టణ కేంద్రంలో ఎస్సీ హాస్టల్‌కు నూతన భవనం నిర్మించాలని, 5 మండలాల విద్యార్థులు చేర్యాల పట్టణ కేంద్రానికి చదువు నిమిత్తం వస్తుంటారని, హాస్టల్ ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుందన్నారు. జిల్లా అధికారులు స్పందించి హాస్టల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు.కార్యక్రమంలో డివిజన్ నాయకులు సంజీవ్, మధు, రాకేష్, శివ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

దుబ్బాకటౌన్: టీఎస్పీఎస్ పేపర్ లీకేజీపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ విచారణ నివేదికను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ వివేక్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో దుబ్బాకలో నిరసన తెలిపారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం తహసీల్దార్ సలీమియాకు అందించారు. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలని, పేపర్ లీకేజీతో నష్టపోయిన నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని త్వరగా గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ దుబ్బాక బాధ్యులు ప్రశాంత్, విసీల్, అక్షర, సుచిత్ర తదితరులు ఉన్నారు.

## సీపీఆర్‌తో పునర్జన్మ అందించవచ్చు



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు

వర్గల్(గజ్వేల్): కార్డియో అరెస్టుకు గురైన వారికి సీపీఆర్‌తో పునర్జన్మ అందించవచ్చని పోలీసు, వైద్యాధికారులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గౌరారం లక్ష్మీమాధవ ఫంక్షన్‌హాల్‌లో గ్రీన్ హెల్త్ సర్వీక్షాధ్వర్యంలో డాక్టర్ అనూష, డాక్టర్ దీప్తి, ఏసీపీ చంద్రభాను, ఈఎస్‌టీ రాజకుమార్, రమేష్ గౌడ్, గజ్వేల్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ సంపత్ తదితరులు ఆటో డ్రైవర్లు, రోడ్డు వెండర్లు, హెచ్‌కేఆర్ పెట్రోలింగ్ సిబ్బందికి అవగాహన కల్పించారు. మారిన జీవన శైలికి అనుగుణంగా ఆహారంలో మార్పులు చేసుకోవాలని, ప్రతీ ఒక్కరు సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. ఏదైన ప్రమాదం జరిగి గుండె స్తంభిస్తే సీపీఆర్‌తో తిరిగి పనిచేసేలా చేయొచ్చన్నారు. విద్యుత్ షాక్, రోడ్డు ప్రమాదాలు, స్పృహ కోల్పోవడం, శ్వాస తదితర సమయాల్లో సీపీఆర్ ఛాతిమీద పలుమార్లు బలంగా నొక్కి, సీపీఆర్ చేస్తే ప్రాణాలు కాపాడవచ్చని సూచించారు.

## పౌష్టికాహారంతో ఆరోగ్యం సొంతం



వర్గల్: సీమంతం చేస్తున్న సీడీపీఓ వెంకటరాజమ్మ

గజ్వేల్‌రూరల్: పౌష్టికాహారంతో ఆరోగ్యం సొంతం అవుతుందని అంగన్‌వాడీ టీచర్ శ్రీలత అన్నారు. శుక్రవారం గజ్వేల్ పట్టణంలోని 5వ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య సూచనలు చేశారు. అనంతరం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఎండాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై వివరించి, చిన్నారులకు అభివృద్ధి కార్డులను అందించారు. కార్యక్రమంలో ఆయా నాగరాణి, తల్లులు, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.

#### సామూహిక సీమంతాలు

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం నాచారం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సామూహిక అన్నప్రాసన, సీమంతం నిర్వహించారు. ఆరునెలలు దాటిన పిల్లలకు అన్నప్రాసన, మూడేళ్లు నిండిన చిన్నారులకు అక్షరాభ్యాసాలు, గర్భిణులకు సీమంతం చేశారు. ఈ సందర్భంగా మాతా శిశుసంరక్షణపై గజ్వేల్ సీడీపీఓ వెంకటరాజమ్మ అవగాహన కల్పించారు. సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ వెంకటేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, టీచర్లు పాల్గొన్నారు.

### సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

మద్దూరు(హుస్నాబాద్): సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నాగపూరి కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని బెక్కల్‌కు చెందిన కృష్ణస్వామికి మంజూరైన రూ.15వేల చెక్కును అందజేశారు. అంతకు ముందు కూటిగల్ గ్రామంలో ఇటీవల మరణించిన నల్ల ఉప్పలయ్య, కొండాపూర్‌లో ఎలికంటి రాజిరెడ్డి కుటుంబలను పరామర్శించారు.

### నీటి సమస్య పరిష్కారం



మోటార్ బిగిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలం లకుడారం గ్రామంలో మంచినీటి సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. లకుడారం, మధిర కోలోని వంపు, కాకులగడ్డలో మంచినీరు అందక బోరుబావులను ఆశ్రయించడంపై ఈనెల 20 సాక్షిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామంలోని ఓవర్ హెడ్ ట్యాంకులోకి భగీరథ నీటిని ఎక్కించేందుకు బూస్టర్ పంప్ మోటార్‌ను కొనుగోలు చేసి, శుక్రవారం సాయంత్రం బిగించారు. శనివారం అన్ని గ్రామాలకు నీటిని అందిస్తామని అన్నారు. నీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన సాక్షి యాజమాన్యం, సిబ్బందికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## సంక్షిప్త వార్తలు

◆ **ఎంపీకి ఆహ్వానం**

తొగుట(దుబ్బాక): పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణోత్సవానికి రావాలని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డికి నిర్వాహకులు ఆహ్వానం అందించారు. శుక్రవారం ఆయనను కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, ఎంపీటీసీ నర్సింలు, ముదిరాజ్ సంఘం నాయకులు నర్సింలు, రాములు, నారాయణ, బాలయ్య పాల్గొన్నారు.

◆ **మైనార్టీల అభివృద్ధికి కృషి**

జగదేవ్‌పూర్(గజ్వేల్): మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కార్యాలయంలో ముస్లింలను రంజాన్ కానుకలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మైనార్టీల సంక్షేమానికి ఎన్నో పథకాలను తీసుకువచ్చారని అన్నారు. మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని, అల్లా దయతో అందరూ బాగుండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలేషంగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, ఆత్మ చైర్మన్ రంగారెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు ఏక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

◆ **దుస్తులు పంపిణీ**

కొండపాక(గజ్వేల్): రంజాన్ పండగ సందర్భంగా మండలంలోని ముస్లింలకు ఎంపీపీ ర్యాగల్ల సుగుణ దుస్తుల పంపిణీ దోహదపడుతుందని చేశబూరు. మండల కేంద్రంలోని రైతు వేదికలో సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఆరెపల్లి మహదేవ్‌గౌడ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు చిట్టి మాధురీ రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు చింతల సాయిబాబాగౌడ్, తహసీల్దార్ రామేశ్వర్, ఎంపీడీఓ రాంరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నూనె కుమార్, సర్పంచ్‌లు రమేష్, రవీందర్, మల్లేశం, సంజీవరెడ్డి, ఎంపీటీసీలు అనుసూయ, లక్ష్మి, ఆంజనేయులు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

◆ **కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్**

హుస్నాబాద్: రంజాన్ సందర్భంగా పట్టణంలోని జమా మసీద్‌లో శుక్రవారం రాత్రి ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, నాయకులు పాల్గొన్నారు.

**కుకునూర్‌పల్లిలో..**

కొండపాక(గజ్వేల్): కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విరుపాక శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కుకునూరుపల్లిలో శుక్రవారం 200 మంది ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ విరుపాక ప్రణవీరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ నర్సింహ్మాచారి,నాయకులు వీరేశం, రెడ్డమైన రవీందర్, అభీబ్, జేసీబీ రవి, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

◆ **నిత్యావసర సరుకులు పంపిణీ**

గజ్వేల్‌రూరల్: రంజాన్ పురస్కరించుకొని సిద్దిపేట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద ముస్లింలకు ఆ ఫౌండేషన్ ప్రతినిధులు సాదక్, షౌకత్‌అలీ శుక్రవారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు అజీమ్‌షరీఫ్, అఫ్జీనా తదితరులు పాల్గొన్నారు.

◆ **ఆలయ నిర్మాణానికి విరాళం**

ములుగు(గజ్వేల్): మండలంలోని బండ మైలారంలో నిర్మిస్తున్న మల్లన్న ఆలయానికి ములుగు మండల పీఏసీఎస్ వైస్ చైర్మన్ కుక్కల నరేష్‌గౌడ్ శుక్రవారం రూ.లక్ష చెక్కును అందజేశారు. సర్పంచ్ అనిత, ఉపసర్పంచ్ శంకరప్ప, కృష్ణ, భిక్షపతి, సామ్యూల్, మల్లయ్య, వెంకటేష్, సురేష్‌కుమార్, సత్యనారాయణ, కుమార్, మహేష్, వీరగౌడ్ పాల్గొన్నారు.

◆ **వైద్య సేవలపై హర్షం**

నంగునూరు(సిద్దిపేట): కంటి వెలుగు శిబిరంలో వైద్య సిబ్బంది అందించిన సేవలు హర్షణీయమని సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు వేముల కొండల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బద్దిపడగలో కంటి వెలుగు శిబిరం ముగింపు సందర్భంగా వైద్య సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జ్యోత్స్న, ఉప సర్పచ్ రాజేందర్, నరసింహారెడ్డి, పర్శరాములు, రమేష్, బాబు, రాములు తదితరులు పాల్గొన్నారు.

◆ **నష్టపోయిన రైతులకు పరిహారమివ్వాలి**

బెజ్జంకి(సిద్దిపేట): వడగండ్లతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని యువజన కాంగ్రెస్ ఆర్‌టీఐ డిపార్ట్‌మెంట్ జిల్లా అధ్యక్షుడు శ్రావణ కుమార్ అన్నారు. శుక్రవారం వ్యవసాయ శాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు. నష్టపోయిన ప్రతీ రైతును ఆదుకోవాలని కోరారు. ఆయనతో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నాకర్ రెడ్డి, డీపీ రావు, శ్రీనివాస్‌రెడ్డి, రాములు, శ్రీకాంత్, ఐలయ్య, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

◆ **భవితకు పునాది పాఠశాల**

హుస్నాబాద్‌రూరల్: విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు పునాది పాఠశాలలేనని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. పోతారం(ఎస్) ప్రాథమిక పాఠశాల 60 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం రాత్రి నిర్వహించిన వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, ఎంపీపీ లకావత్ మానస, సర్పంచ్ బత్తిని సాయిలు, ఎంపీటీసీ బొమ్మగాని శ్రీనివాస్, ఎంఈఓ దేశిరెడ్డి, ఉపాధ్యాయులు శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలు**

నంగునూరు(సిద్దిపేట): ఈ నెల 25 నుంచి ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ దేశిరెడ్డి శుక్రవారం తెలిపారు. పాలమాకుల పాఠశాలలో పదో తరగతి, రాజగోపాల్‌పేట పాఠశాలలో ఇంటర్ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు పరీక్షలు ఉంటాయన్నారు.

◆ **విద్యుత్ భారం తగ్గించుకోవాలి**

మర్కూక్(గజ్వేల్): గృహ వినియోగదారులు విద్యుత్ భారం తగ్గించుకునేందుకు టీఎస్ రెడ్ కో అందిస్తున్న ఫ్యాన్లను వాడాలని ఎంపీపీ పాండుగౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎర్రవల్లిలో రాష్ట్ర పునరుద్ధరణ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ ద్వారా 28 వాట్స్ బీఎల్‌డీసీ ఎనర్జీ ఎఫిషియన్సీ ఫ్యాన్స్‌ను పంపిణీ చేశారు. మేనేజర్ రాం మోహన్‌రావు, ఉపసర్పంచ్ కనకయ్య పాల్గొన్నారు.

◆ **పోలీసులకు ఫిర్యాదు**

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని పోతిరెడ్డిపల్లికి చెందిన కత్తుల భాస్కర్‌రెడ్డి తమ విధులకు ఆటంకం కలిగించాడని గ్రామ కార్యదర్శి పల్లె రజిత, ఏఈఓ గంగరవేని సమజాత గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

◆ **23 నుంచి ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం**

మిరుదొడ్డి(దుబ్బాక): మండలంలోని మల్లుపల్లిలోని రేణుకా ఎల్లమ్మ ఆలలయ పంచమ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 23 నుండి 25 వరకు కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

◆ **క్షణికావేశంతో ప్రాణాలు తీసుకోవద్దు**

తొగుట(దుబ్బాక): చిన్న చిన్న తగాదాలతో పంతాలకు పోవొద్దని, క్షణికావేశంలో ప్రాణాలు తీసుకోవొద్దని తొగుట ఎస్‌ఐ కర్ణాకర్‌రెడ్డి ప్రజలకు సూచించారు. పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఘనపురంలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. బాలికలు, మహిళల చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలపై జాగ్రత్తలను వివరించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరిగితే డయల్ 100కు, సిద్దిపేట పోలీస్ కంట్రోల్ రూమ్ 8712663100కు కాల్ చేయాలన్నారు.

◆ **వేలం ద్వారా 2లక్షల ఆదాయం**

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్ గ్రామంలో వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన 25 ఎకరాల భూమికి సర్పంచ్ భానుప్రకాష్ రావు ఆధ్వర్యంలో శుక్రవారం వేలం నిర్వహించారు. ఈసందర్భంగా రూ.2 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ నిర్వహణ అధికారి మోహన్‌రెడ్డి తెలిపారు. ఏడాది పాటు భూమిని సాగు చేసుకునేందుకు రైతులు అందించినట్లు తెలిపారు.

◆ **కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

సిద్దిపేటజోన్: సిద్దిపేట పత్తి మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ విజిత అన్నారు. సిద్దిపేట యార్డులో 1891 మంది రైతుల నుంచి 23 వేల క్వింటాళ్ల పొద్దుతిరుగుడు కొనుగోలు చేశామని, రూ.6కోట్లను రైతులకు చెల్లించినట్లు తెలిపారు. డిమాండ్ దృష్ట్యా కొనుగోలు అనుమతి పెంచాలని మంత్రి హరీశ్‌రావును కోరగా మంజూరు చేశారని, ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

◆ **సోలార్ వినియోగంపై అవగాహన**

సిద్దిపేటరూరల్: నారాయణరావుపేట మండలం బంజేరుపల్లిని శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్ర విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా సోలార్ విద్యుత్ వినియోగంపై సర్పంచ్ శంకర్, సెక్రటరీ శ్వేత శుక్రవారం అవగాహన కల్పించారు. సందర్శనలో గైడ్ టీచర్ కృష్ణయ్య, విద్యార్థులు అక్షయ్ కుమార్, మధుశేఖర్, కనక దుర్గ, స్రవంతి, తుకారాం, ప్రవీణ్ పాల్గొన్నారు.

◆ **నేత్ర శిబిరం ప్రారంభం**

సిద్దిపేటరూరల్: పైసా ఖర్చు లేకుండా ఉచితంగా అందిస్తున్న కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఇర్కోడ్, వెంకటాపూర్ గ్రామాల్లో ఎంపీపీ శ్రీదేవి చందర్ రావు, జెడ్పీటీసీ శ్రీవాణి గౌడ్‌తో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ ఎల్లం, ఎంఈడీఓ సమ్మిరెడ్డి తదితరులు ఉన్నారు.

◆ **ముగిసిన మూల్యాంకనం**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పదో తరగతి మూల్యాంకనం శుక్రవారం ముగిసిందని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సహకరించిన ఉపాధ్యాయులకు, నాయకులకు, అధికారులకు ఈసందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

◆ **చెక్కు అందజేత**

చేర్యాల(సిద్దిపేట): పట్టణానికి చెందిన కళ్యాణపు ఐలయ్య అనారోగ్యంతో ఇబ్బంది చికిత్స నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా మంజూరైన చెక్కును బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ పంపిణీ చేశాడు. శుక్రవారం ఐలయ్య కుటుంబసభ్యులకు రూ.60వేల చెక్కును అందించారు. కార్యక్రమంలో పట్టణ యూత్ అధ్యక్షుడు యాట బిక్షపతి, నాయకులు బాబు, రవి, కృష్ణ, సాయికిరణ్, ఉదయ్, వెంకట్, బాబు పాల్గొన్నారు.